క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి ఆర్థిక సాయం



నరసరావుపేట: ఇటీవల మృతి చెందిన గురవాయపాలెం మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ రాజు కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజు కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, నాయకులు వెంకటప్పా రెడ్డి, కనకా పుల్లారెడ్డి, చింతగుంట రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్పగాయాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో చెట్టును ఢీకొనడంతో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. శావల్యాపురం మండలం నుంచి కూలీ పనుల నిమిత్తం 15 మంది ట్రాలీ ఆటోలో వెళ్తుండగా వినుకొండ రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల ఎస్సీ బాలికల వసతి గృహంలో జైభీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్టణ ఎస్ఐ కె.స్వర్ణలత మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ముట్లూరి ఎలీషాబాబు, గంధం హరిప్రసాద్, నేలపట్ల అశోక్‌బాబు, నీలం శేఖర్‌బాబు, ఎం.డి.జె.కుమార్, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బూదాల సౌభాగ్యరాజు, వసతి గృహ సంరక్షకురాలు రేణుక, వసతి గృహసిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం ఎంపీడీవో బదిలీ

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పేరుమీనా సీతారామయ్య ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. మండల ప్రజలు ప్రజాప్రతినిధులు, సహచర ఉద్యోగుల సహకారంతో 16 నెలల పాటు మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

నాదెండ్ల: బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన ఉన్నవ వెంకటేశ్వర్లు కొంతకాలంగా గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసిన క్వార్టర్ బాటిళ్లను అధికధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేయగా, 16 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.

ఈ-క్రాప్ నమోదు చేయించాలి

శావల్యాపురం: రబీ సీజనులో రైతులు సాగు చేసిన పంటలన్నీ ఈ-క్రాప్ నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ కోరారు. శనివారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ 3906 ఎకరాల పంటను సాగు చేయగా ఇప్పటి వరకు 3226 ఎకరాలు పంటను ఈ-క్రాప్ నమోదు చేశారన్నారు. ఇందుకుగాను కొత్తలూరు-402 ఎకరాలు, పొట్లూరు-436, వేల్పూరు-956, కనమర్లపూడి-72, పిచికలపాలెం-290, కారుమంచి-680 ఎకరాల పంటను సాగు చేశారన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలను ప్రభుత్వం మద్దతూ ధరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో రైతులు ఈ-క్రాప్ నమోదు అధికంగా చేయాల్సి ఉందన్నారు. కంది పంటను క్వింటా రూ. 9445 రూపాయలు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

విషాదంలో వేలూరు

- హజరత్ వలి అంత్యక్రియల నిర్వహణ
- బాధితులకు నగదు వితరణ చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త



మృతుడు హజరత్‌వలి (ఫైల్)



మృతుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు అప్పాపురం గ్రామంలోని మిర్చికోతలకు వెళ్తున్న క్రమంలో శుక్రవారం ఆటో, ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడిన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన వేలూరు గ్రామవాసి షేక్ హజరత్‌వలి (60) చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందాడు. ముందురోజు గన్నవరపు శివపార్వతి, ఏకసిరి హనుమాయమ్మల మృతదేహాలను అదేరోజు చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. హజరత్‌వలి మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం నిర్వహించి రూరల్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ విషాదఛాయల నుంచి తేరుకోకముందే రెండోరోజు హజరత్ వలి భౌతికకాయం ఊరిలోకి తీసుకురావడంతో కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. సాయంత్రం హజరత్‌వలి భౌతికకాయాన్ని ముస్లిం సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

మానవత్వం చాటుకున్న మల్లెల

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు మానవత్వం చాటుకున్నారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేలూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు గన్నవరపు శివపార్వతి, ఏకసిరి హనుమాయమ్మ, షేక్ హజరత్‌వలి మృతి చెందిన సంగతి విదితమే. బాధిత కుటుంబాలను పరామర్శించిన సందర్భంగా మృతి చెందిన ఒక్కొక్కరికీ వ్యక్తిగతంగా రూ. లక్ష చొప్పున అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు శనివారం వేలూరు గ్రామానికి వెళ్లి సదరు నగదును అందజేశారు. దీనికి తోడు ఇదే రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వైద్య ఖర్చులు సైతం తానే భరిస్తూ సహృదయత చాటు కోవడం పట్ల ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అల్లీమియా, పంగులూరి వెంగళరాయుడు, గుంజి వీరాంజనేయులు, పఠాన్ దౌలత్‌ఖాన్, కృష్ణవరపు శేఖర్, దిలీప్, ధనరాజ్, సుబ్బారావు, దేవరాజు, ముసలయ్య, బొంత రమణయ్య పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ కృషి



ముస్లిం వక్త సిరాజ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, ముస్లిం నాయకులు



టౌన్‌హాలులో సిరాజ్ ప్రసంగాన్ని వింటున్న నగరవాసులు

ప్రముఖ వక్త సిరాజ్ సన్మాన సభలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి భువనచంద్ర టౌన్‌హాలులో దేశంకోసం ముస్లిం యోధులు అనే అంశంపై ప్రముఖ వక్త బీఆర్ సిరాజ్ చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా అద్భుతంగా ప్రసంగం చేసిన సిరాజ్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. స్వాతంత్ర ఉద్యమంలో ముస్లింలైన సరిహద్దు గాంధీగా పిలువబడిన అబ్దుల్ గఫార్‌ఖాన్, అబ్దుల్ కలాం ఆజాద్ లాంటి ప్రముఖులు ఉన్నారన్నారు. వారు స్వాతంత్రం కోసం చేసిన సేవలు ఎనలేనివన్నారు. సీఎం జగన్ ప్రత్యేకంగా రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. అమ్మఒడి పథకంతో పేద పిల్లలు అందరూ చదువుకునే వసతి కల్పించారన్నారు. పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు ఉచితంగా అందజేశారన్నారు. దివంగత వైఎస్సార్ తీసుకొచ్చిన నాలుగుశాతం రిజర్వేషన్ వలన ముస్లిం సోదరులు అనేక మంది డాక్టర్లు, ఇంజినీర్లు కాగలిగారన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో అనేక మంది చదువుకోగలిగారన్నారు. చినతురకపాలెం గ్రామంలో 50 మంది డాక్టర్లు, 200 మంది ఇంజినీర్లు కాగలిగారనీ, ఢిల్లీ ఎయిమ్స్ లాంటి కళాశాలలో చదువుకున్నారన్నారు. చదువుతోనే ఉన్నతస్థానం లభిస్తుందనటంలో ఎటువంటి సందేహాలు లేవని వెల్లడించారు. ముస్లింలు తమ పిల్లలను చదివించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ముస్లిం నాయకులు, పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారిక యాత్రను విజయవంతం చేద్దాం



గణపవరంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

నాదెండ్ల: చిలకలూరిపేటలో ఈనెల 29న జరిగే సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు చిలకలూరిపేట పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. పార్టీ ముఖ్యనేత విజయసాయిరెడ్డితో పాటూ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ హోదాల్లోని నాయకులు హాజరౌతారన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీగా సభా ప్రాంతానికి తరలి వెళ్లాలన్నారు. మరోదఫా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రతిఒక్క కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాటా రత్తయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ బొప్పడి రామారావు, మాజీ ఉపసర్పంచ్‌లు గాలి బుచ్చయ్య, షేక్ రహంతుల్లా, జెడ్పీ హైస్కూలు పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, నాయకులు కె.నాగయ్య, కోటేశ్వరరావు, ప్రభుదాసు, భీమయ్య, ఆంజనేయులు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు: బీసీ సాధికార బస్సు యాత్రను పార్టీశ్రేణులు సమన్వయంతో విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్ కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో పార్టీ మండల స్థాయి నాయకులతో శనివారం పర్యటించారు. ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు బస్సుయాత్ర నియోజకవర్గాన్ని చేరుకుంటుందని, ఈ సందర్భంగా చిలకలూరిపేట పట్టణంలో ప్రజలతో కలిసి పాదయాత్ర, బహింరంగ సమావేశం ఉంటుందన్నారు. ఈ సామాజిక సాధికార బస్సుయాత్రకు వైఎస్సార్ సీపీకు చెందిన అతిరథ మహారథులు కానున్నారని తెలిపారు. మండలం పరిధిలోని పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్తావాసు, జేఏసీ కన్వీనర్ రాచమంటి చింతారావు, మాజీ ఎంపీపీ ఎంవీబాలచంద్రారెడ్డి, నాయకులు వడ్డేపల్లి నరసింహరావు, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, చాగంటి శ్రీధర్, రసూల్, హుస్సేన్, సాంబశివరావు, ఎల్లటూరి శ్రీనివాసరావు ఉన్నారు.

కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ రూ. 10 కోట్లతో ప్రణాళికలు రూపొందించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. నిధులు త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉందని, అయిన వెంటనే పట్టణంలో ఎలాంటి మౌలిక వసతుల లోటు లేకుండా అభివృద్ధి పనులు ప్రారంభి పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎజెండాలో పొందుపరిచిన 50 అంశాలతో పాటు, టేబుల్ ఎజెండాలో పొందుపరిచిన మరో ఐదు అంశాలను కలిపి అన్ని అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

గుమ్మడికి ఆర్టీసీ సిబ్బంది అభినందనలు



గుమ్మడిని అభినందిస్తున్న డీఎం కోటేశ్వరరావునాయక్

వినుకొండ(నూజెండ్ల): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న గుమ్మడి వెంకటేశ్వర్లును స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం కోటేశ్వరరావునాయక్ అభినందించారు. గుమ్మడి వెంకటేశ్వర్లు ఆర్టీసీలో చిన్న ఉద్యోగం చేస్తూ గుమ్మడి వృద్ధాశ్రమ నిర్వాహకులుగా, సమాజ సేవకులుగా సామాజిక సేవలో గత 20 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న గుమ్మడికి సేవా పురస్కారం అందుకోవడం అభినందనీయమని డీఎం అన్నారు.

ఘనంగా వాగ్దేవి డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు

నరసరావుపేట: రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కళాశాల 11వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిటైర్డు అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ భవనం ఆంజనేయ రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ కపిలవాయి రాజాశంకరరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుండే మంచి నడవడిక, స్నేహాలు, అలవాట్లు ఏర్పరుచుకోవాలని, మనం ఉండే పరిసరాలను బట్టి, స్నేహితులను బట్టి వారి ప్రవర్తన, భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. స్వామి వివేకానందుడు, మహాత్మాగాంధీ వంటి గొప్పవారి జీవిత చరిత్రలు చదవడం ద్వారా యువత ఆలోచనా విధానంలో మార్పు వస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులే విద్యార్థులకు నిజమైన హీరోలని, గురువులే ప్రత్యక్ష దైవమని, విద్యార్థి దశలో ఏ విద్యార్థి అయితే సమయం వృథా చేయకుండా క్రమశిక్షణతో ఎవరైతే ఉంటారో వారు నిజ జీవితంలో ఉన్న త స్థాయిలో నిలుస్తారన్నారు. తదనంతరం యూనివర్సిటీ ప్రకటించిన సెమిస్టరు ఫలితాలలో టౌన్, యూనివర్సిటీ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు, క్రీడలలో నేషనల్, స్టేట్ లెవెల్స్‌కు ఎంపికైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్ బాబు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కెపల్లి క్రిష్ణ కిషోర్, ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో పాటు పశుపోషణ అవసరం



మూగచింతలపాలెంలో లేగదూడల ప్రదర్శనలో పాల్గొన్న రైతులు

బొల్లాపల్లి: మండలంలోని మూగ చింతలపాలెం గ్రామంలో పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు 45 దూడలను ప్రదర్శించారు. అనంతరం ఈపూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పశు పోషకులు మేలు జాతి పశువులును ఎంచుకోవాలని, వ్యవసాయంతో పాటు పశుపోషణ రైతుకు అవసరమని, అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. ప్రతి ఏడాది ఒక దూడను సృష్టించే విధంగా యజమాన్య పద్ధతులు పాటిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో బొల్లాపల్లి, వెల్లటూరు పశు వైద్యాధికారులు పి అమీర్‌బాషా, జి కవిత,ఆర్‌బికె ఇన్‌చార్జి సి.హెచ్.ఎడుకొండలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేటలో ముగిసిన ఆటల పోటీలు



ఖోఖో లో ద్వితీయస్థానం సాధించిన నాదెండ్ల జట్టుకు బహుమతులు అందిస్తున్న అధికారులు

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో ఖోఖో పోటీలు శనివారంతో ముగిశాయి. చిలకలూరిపేటలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్‌స్కూలు గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో నాదెండ్ల మండల టీం రెండో స్థానంలో నిలిచింది. మొదటి బహుమతిని చిలకలూరిపేట రూరల్ మండల జట్టు గెలుపొందగా, తృతీయ బహుమతి యడ్లపాడు మండల జట్టు దక్కించుకుంది. నియోజకవర్గస్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఉమెన్ క్రికెట్ పోటీల్లో నాదెండ్ల జట్టు మొదటిస్థానంలో, షటిల్ బ్యాడ్మింటన్ మెన్ విభాగంలో, షటిల్ ఉమెన్ విభాగంలో నాదెండ్ల జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు మున్సిపల్ కమీషనర్ సీహెచ్ గోవిందంరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, ఎంపీడీవోలు షేక్ జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసరావు, డీఈ రమణ, ఏఈ శ్రీనివాసరావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ ఆడుదాం ఆంధ్రా క్రీడల కన్వీనర్ షేక్ అచ్చేమియా, పీడీ, పీఈటీలు ఖాదర్‌మస్తాన్, జాస్తి శ్రీకాంత్, ఏఎంజీ రాజు, ఇస్మాయిల్, ఎం.సుబ్బారావు, మాధురి, షేక్ అమీర్ హుస్సేన్, మధు ఉన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవు



డీఎస్పీ కార్యాలయంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కేవీ మహేష్

నరసరావుపేట: ఎటువంటి గొడవలకు కారణమైనా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని డీఎస్పీ కేవీ మహేష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మరో రెండు నెలల్లో రానున్న ఎన్నికలను పురస్కరించుకుని శనివారం డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే వివిధ కారణాలతో మీపై రౌడీషీట్లు ఉన్నాయని, ఇక ముందు ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలిగితే వాటిని తొలగించే అవకాశం ఉందన్నారు. వచ్చే రెండు నెలల కాలంలో ఎన్నికలు జరుగుతాయని, ఈలోగా రాజకీయ పార్టీల ప్రచారం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా దౌర్జన్యాలు, దాడులు, మారణాయుధాలతో తిరగటం, బెదిరింపులకు పాల్పడటం లాంటి చర్యలకు పాల్పడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మీపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, అందరూ ప్రశాంత జీవనం చేయాలని సూచించారు. వినుకొండ, చిలకలూరిపేట, నరసరావుపేట సీఐలు పాల్గొన్నారు.

'శ్రీదత్త'లో ఆరుగురు హృద్రోగులకు పునర్జన్మ

ఆస్పత్రి ఎం.డి డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ జ్ఞానేశ్వరి దంపతులు

నరసరావుపేట: గుండె స్పందనలో తీవ్రమైన మార్పులకు గురైన ఆరుగురు పేషెంట్లకు సకాలంలో సమర్థవంతమైన వైద్యసేవలు అందించి వారికి పునరుజ్జీవం కల్పించటం జరిగిందని ప్రముఖ గుండె వైద్య నిపుణులు శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ పేర్కొన్నారు. వీరిలో నలుగురు 30 ఏళ్లలోపు వారు అన్నారు. శనివారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాజుపాలెం గ్రామానికి చెందిన నరసింహారావు, రొంపిచర్ల గ్రామానికి చెందిన కోట శ్రీను, దర్శి గ్రామానికి చెందిన జి.కృష్ణ, అడవి పాలెం గ్రామానికి చెందిన అవినాష్, రాయవరం గ్రామానికి చెందిన నరసింహా నాయక్, రెంటచింతల గ్రామానికి చెందిన షేక్ రంజాన్ బి అనే పేషెంట్లు సడన్‌గా కార్డియాక్ అరెస్ట్ కావటంతో వేర్వేరు సమయాల్లో తమ హాస్పిటల్‌ను సంప్రదించారన్నారు. వారికి సీపీఆర్ చేసి, వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించి ఏంజియోగ్రామ్ చేశామన్నారు. వీరికి గుండెకి రక్తం సరఫరా అయ్యే రక్తనాళాలలో పూడికలు ఉన్నట్లు గుర్తించామన్నారు. తమ హాస్పిటల్‌లోని ఆధునిక వసతుల ద్వారా క్లిష్టతర పద్ధతుల్లో స్టెంట్ అమరిక నిర్వహించామన్నారు. ఆయాసం, దడ, కళ్లు తిరగటం, దవడ నొప్పి, వాంతులు, నీరసం వంటివి కూడా గుండె పోటు సంకేతాలు కావచ్చని ఈ లక్షణాలు తీవ్రమైన గుండె జబ్బును సూచిస్తాయని పేర్కొన్నారు. డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకే పల్లెనిద్ర

యడ్లపాడు: ప్రజలకు చట్టపరంగా మెరుగైన సేవలు అందించడానికి నిబద్ధతతో పనిచేస్తుందని ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని తుర్లపాడు గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బృందం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడిన వ్యక్తుల్ని ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగినా, చీకటి కార్యక్రమాలు జరుగుతున్నా సత్వరమే సమాచారం అందించాలని కోరారు. గ్రామస్తులు ఎన్నికల నేపథ్యంలో పల్లెలో ఎటువంటి వివాదాలు, ఘర్షణలు పెట్టుకోవద్దన్నారు. అలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని, దీంతో వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఊరి ప్రజల మధ్య సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని శాంతియుతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడి

ఈపూరు: మండలంలోని ఇనిమెళ్ల గ్రామ సమీపంలోని అడవుల్లో గల కుందేలు బోడు వద్ద నాటుసారా కాసే స్థావరాలపై ఎస్ఐ ఎస్‌కే. ఎండీ.ఫిరోజ్, పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా కాసే నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 200 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

- లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగ వెంకటలక్ష్మి శనివారం తెలిపారు.